సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం ◆ 29 ◆ ఏప్రిల్ ◆ 2023



కళకళలాడుతున్న కందిమల్లాయపల్లె

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలతో కందిమల్లాయపల్లె కళకళలాడుతోంది. -IIలో..



అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

కడప నగరం వేదికగా ఏసీఏ అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. -IIలో..



ఇప్పుడైనా అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?

కడపలోని వైద్యారోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకం దుమారం రేపింది. -IIలో.

న్యూస్‌రీల్

ఇద్దరు మైనింగ్ అధికారుల బదిలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా మైనింగ్‌శాఖలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులను బదిలీ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కడపలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డి.రవిప్రసాద్‌ను అన్నమయ్య జిల్లాలోని రాయచోటి జిల్లా మైనింగ్ అధికారిగా, వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లలో ఏడీగా పనిచేస్తున్న ఆర్.రాజేష్‌కుమార్‌ను బాపట్ల జిల్లా మైనింగ్ అధికారిగా బదిలీ చేశారు.

పోస్టల్ ఇన్‌చార్జి నియామకం



సీహెచ్ శ్రీనివాసరావు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప డివిజన్ ఇన్‌చార్జ్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రస్తుతం పని చేస్తున్న గౌస్ ఆజామ్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో సీహెచ్ శ్రీనివాసరావును ఇన్‌చార్జి పోస్టల్ సూపరింటెండెంట్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది.

రేపు సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం 10.00 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు పాదిలి పెంచలయ్య, అసోసియేట్ అధ్యక్షులు ముద్దనూరు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ జీఈఎఫ్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈనెల 29వ తేదీ కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కొందరు ఇచ్చిన పిలుపునకు సచివాలయ ఉద్యోగులు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సచివాలయ ఉద్యోగులు తరలి రావాలని కోరారు.

రేషన్‌లో రాగులు, జొన్నలు

- మే నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- ఒక్కో కార్డుకు 1 నుంచి 3 కిలోలు



రేషన్ వాహనం (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : మే నెల నుంచి జిల్లాలోని బియ్యం కార్డుదారులకు ఉచితంగా రాగులు, జొన్నలు పంపిణీ చేయనున్నారు.ఒక్కో కార్డుకు 1 నుంచి 3 కిలోలు ఇస్తారు. ఆ మేరకు బియ్యంలో కోత విధిస్తారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు చిరుధాన్యాల పంపిణీ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మే ఐదారు తేదీల నుంచి పంపిణీ చేపడతారు. జిల్లాకు శ్రీ సత్యసాయి ట్రస్టు ద్వారా ప్రతినెల 17.50 మెట్రిక్ టన్నుల రాగి పిండి, 17.50 మెట్రిక్ టన్నుల బెల్లం పిండి సరఫరా అవుతుంది. ఇప్పుడు చౌకదుకాణాల ద్వారా బియ్యంతోపాటు రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 1239 చౌక దుకాణాల పరిధిలోగల 5,76,857 మంది కార్డుదారులకు వీటిని పంపిణీ చేస్తారు. ఇందుకోసం నెలకు 575 మెట్రిక్ టన్నుల చొప్పున రాగులు, జొన్నలు అవసరమవుతాయి. జిల్లాలో రాగి పంట సాగు దాదాపుగా లేనందువల్ల కర్ణాటక నుంచి దిగుమతి చేసుకోవాలని భావించారు. అవి నాసిరకంగా ఉండడంతో వద్దనుకున్నారు. ఇప్పుడు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫైన్ రకం క్వాలిటీ రాగిని కర్ణాటక నుంచి సేకరించి జిల్లాకు పంపుతోంది. ఆరు నెలలకు సరిపడా 3450 మెట్రిక్ టన్నుల రాగులు జిల్లాకు రానున్నాయి. మూడు, నాలుగు రోజుల్లో తొలి విడతగా 2600 మెట్రిక్ టన్నులు రైల్వే వ్యాగన్ ద్వారా జిల్లాకు చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడు నుంచి 850 మెట్రిక్ టన్నులతో కూడిన మరోవ్యాగన్ రానుంది. ధాన్యం జిల్లాకు చేరగానే 13 ఎంఎల్ఎస్ పాయింట్లకు, అక్కడి నుంచి ఎఫ్‌పీ షాపులకు సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పౌరసరఫరాల సంస్థ వద్ద 19 మెట్రిక్ టన్నుల జొన్నలు మాత్రమే ఉన్నాయి. వీటిని ప్రొద్దుటూరు, రాజుపాలెం, చాపాడు మండలాల కార్డుదారులకు మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు సజ్జ, రాగులు, జొన్నలు, నాఫెడ్ తరపున మార్క్‌ఫెడ్ అధికారులు సేకరించేవారు. ఇప్పుడు ఆ బాధ్యతను పౌరసరఫరాల సంస్థ చేపట్టింది.

బలవంతంగా అంటగట్టం

రాగులు, జొన్నలు బలవంతంగా కార్డుదారులకు అంటగట్టం.వారు మొత్తం బియ్యమే కావాలని కోరితే అలాగే ఇస్తారు. రాగులు, జొన్నలు కూడా ఇవ్వాలని అడిగితే ఇస్తాం. ఒక కిలో నుంచి మూడు కిలోల వరకు చిరుధాన్యాలు పంపిణీ చేస్తాం. జొన్నల సేకరణలో ఇప్పటిలాగా అవరోధాలు తలెత్తకుండా ఈసారి ఖరీఫ్‌లో ముందే జాగ్రత్తపడి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

– అర్జున్‌రావు,
జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ, కడప

మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

- విజయవంతం చేయాలి: కలెక్టర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : మే నెల 9న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, జగనన్న భూ హక్కు-భూ రక్ష పథకం, నాడు-నేడు, సచివాలయ సేవలు తదితర అంశాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షించారు. స్థానికంగా ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రక్రియ సీఎం స్వీయ పరిశీలనలో, సీఎంఓ స్థాయి నుంచి నేరుగా సచివాలయాల పరిధిలో పర్యవేక్షణ చేస్తారన్నారు. కార్యక్రమం విజయవంతంగా నడిచేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించారన్నారు. నెలకు రెండు పర్యాయాలు జిల్లాల్లో పర్యటించి కార్యక్రమ అమలు తీరును సమీక్షిస్తారన్నారు.

- ప్రజల ప్రాణభద్రత మనందరి సామాజిక బాధ్యత అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ॥ రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బారికేడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేతక సూచికలను ఏర్పాటు చేయాలని పోలీసు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.
- ప్రజల్లో సామాజిక స్పృహ పెంచాలని, అప్పుడే సమాజంలో మార్పు ప్రారంభమవుతుందని కలెక్టర్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సోషల్ బిహేవియర్ ఛేంజ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు.

రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్ సమీకృత ప్రయోగశాల ప్రారంభించిన మంత్రి

రైల్వేకోడూరు అర్బన్: రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సమీకృత ప్రయోగశాలను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. అన్నదాతలు ఆర్థికంగా బలోపేతం కావడానికి, నాణ్యమైన పంటలు పండించడానికి, అధికదిగుబడులు, లాభాలు సాధించే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ సమీకృతప్రయోగశాలలు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇందులో రైతులు వ్యవసాయ భూమిలో మట్టి, వినియోగించే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, నాణ్యతా పరీక్షలు చేసుకోవచ్చొన్నారు. దీనివల్ల భూమికి తగిన పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. అవసరమైన ఎరువులు, మందులు పిచికారీ చేయవచ్చని తెలిపారు.

మార్కెట్ కమిటీతో సమావేశం

బుడుగుంటపల్లి పంచాయితీలోని ప్రభుత్వ మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, డైరెక్టర్లు, అధికారులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులు మద్దతు ధరలతో సులభంగా అమ్ముకోవడనికి స్థానిక పరిస్థితులను బట్టి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో రైతులకు అనేక పథకాలు అమలు చేస్తుంటే వ్యవసాయం అంటే గిట్టని చంద్రబాబు ప్రభుత్వంపై బురద చల్లే ప్రక్రియలో భాగంగానే నిత్యం విమర్శలు చేస్తున్నారు. అల్జీమర్ వ్యాధితో బాధపడుతున్న చంద్రబాబు ఈరోజు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమం పొందిన ప్రజలు ఏదీ మరచిపోరన్నారు. అందరూ జగన్ వెంటే ఉన్నారని అన్నారు. టీడీపీ పరిపాలనలో వర్షాలు రాక, నీరులేక రైతులు వలసలు పోయారని తండ్రీ కొడుకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. పప్పు అని పేరున్న లోకేష్‌కు పంటల పేర్లు తెలీవన్నారు.కనీసం పప్పు ధాన్యాల పేర్లన్నా చెప్పగలడా అని విమర్శించారు.అంతకుముందు మంత్రి, ప్రభుత్వ విప్ గంగాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్‌నాయకులు కొల్లంగంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజంసుకుమార్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, హేమణవర్మ, తోట శివసాయి, సీహెచ్‌రమేష్, మందలనాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మకు నమస్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి.చిత్రంలో విప్ కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

– మృతులు వైఎస్సార్ జిల్లా వాసులు

పాణ్యం(కర్నూలు జిల్లా) : కర్నూలు జిల్లాలోని కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై పాణ్యం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని యానాది కాలనీలో నివాసముంటున్న బరిగెల వెంకటేశులు (47), ప్రమీల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశులు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో పాణ్యం సమీపంలో పసురు తాపించి మద్యం మానిపించాలని ప్రమీల భావించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం బైక్‌పై భార్యాభర్త పాణ్యం చెంచుకాలనీలో సుంకులా పరమేశ్వరీ ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజారులు ఇచ్చే పసురు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అయితే గుడికి 50 మీటర్ల దూరంలో జాతీయ రహదారిని దాటేందుకు వెహికల్ అండర్ పాస్ ఉంది. అయినా కిలో మీటరు దూరంలోని యూటర్న్ వద్ద దాటాలని భావించి, రాంగ్ రూట్‌లో వెళ్లాడు. వేగంగా డివైడర్ వెంట వెళ్తుండగా యూటర్న్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. వేగంగా వస్తున్న బస్సును డ్రైవర్ అదుపు చేసే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. బైక్‌ను ఢీకొనడంతో వెనుక కూర్చున్న ప్రమీల రోడ్డుపై పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటేశులు ఎగిరి రోడ్డు పక్కన ఉండే ఇనుప కడ్డీపై పడటంతో తలకు తీవ్ర గాయమై దుర్మరణం చెందాడు. బైక్‌లో ఉన్న పూజా సామగ్రి రోడ్డుపై పడ్డాయి. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబీకులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రుల మృతితో పిల్లలు అనాథలుగా మారారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కళకళలాడుతున్న కందిమల్లాయపల్లె

- వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తులు


గజ వాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు


హరికథ కాలక్షేపం కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

బ్రహ్మంగారిమఠం : శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలతో కందిమల్లాయపల్లె(బ్రహ్మంగారిమఠం) కళకళలాడుతోంది. రెండు రోజుల నుంచి ఈ ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉభయదారులు గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మల్లయ్య, ధనలక్ష్మి, డాక్టర్ యక్కల సురేష్‌బాబు స్వప్న కోరిక మేరకు ఉత్సవం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం హరికథ కాలక్షేపాన్ని సిద్దు రాజ్యలక్ష్మి నిర్వహించారు.

వైభవంగా గజవాహనోత్సవం

రాత్రి గజవాహనోత్సవం వైభవంగా సాగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గజవాహనంపై ఆశీనులను చేశారు. పెద్ద మఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమార స్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్ద మఠం చేరుకుంది. ఉత్సవానికి గుంటూరు జిల్లా బుద్దాంకు చెందిన కట్టోజు సత్యనారాయణచార్యులు, వరహాలమ్మ, విశ్వనాథాచారి, గురుస్వాములు, శివరూపాచారి ఉభయదారులుగా వ్యవహరించారు. మోహిని భస్మాసుర నాటకాన్ని వెంకటగిరికి చెందిన నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి మాలధారులు ఇరుముడి సమర్పణ కోసం పెద్ద ఎత్తున వస్తున్నారు. వారి ఎరుపు రంగు, కషాయ వస్త్రాధారణతోమాఢ వీధులు కళకళలాడుతున్నాయి. దాతలు అన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలు విరివిగా చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజీ, మేనేజర్ ఎస్.ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవింద స్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవం విశిష్టత

ఆలయానికి వచ్చి స్వామి మూలమూర్తిని దర్శించుకోలేని వారి చెంతకు.. ఆ దేవదేవుడే చేరుకోవడం. మూలమూర్తికి ప్రతిరూపంగా ఉన్న ఉత్సవమూర్తులను వీధుల్లో ఊరేగింపు చేయడాన్నే ఉత్సవం అంటారు.

దర్శనీయ స్థలాల వద్ద సందడి

బ్రహ్మంగారిమఠంలోని దర్శనీయ స్థలాల్లో భక్తుల సందడి నెలకొంది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి నివసించిన గృహం, శ్రీ ఈశ్వరీదేవిమఠం, పోలేరమ్మగుడి, కక్కయ్య మఠం, అచలానందస్వామి ఆశ్రమం, రామాలయం, వీరబ్రహ్మేంద్రాశ్రమం, పోలేరమ్మచే నిప్పు తెప్పించిన రచ్చబండ, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, ముడుమాలలోని సిద్దయ్యమఠం, అక్కంపేటలోని విభూతి నాగ లింగేశ్వరస్వామి దేవస్థానం, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ను భక్తులు సందర్శించారు.

బ్రహ్మంగారికి పట్టువస్త్రాల సమర్పణ

బ్రహ్మంగారిమఠం : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి స్థానిక ఎమ్మెల్యే రఘురామిరెడ్డి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనకు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బ్రహ్మంగారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వనిపెంట సర్పంచ్ గౌసుల్ ఆజం తదితరులు పాల్గొన్నారు.

స్నానఘట్టాల ప్రారంభం

స్వామి ఆరాధనోత్సవాలకు పెద్ద ఎత్తున వచ్చే భక్తుల కోసం బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ సమీపంలో స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. సింగిల్ విండో అధ్యక్షుడు నేలటూరి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లు ఆరంభం

కడప స్పోర్ట్స్ : కడప నగరం వేదికగా ఏసీఏ అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 45 ఓవర్లలో 274 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని తేజారెడ్డి 73 పరుగులు, ధరణికుమార్‌నాయుడు 58 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు అక్షిత్‌రెడ్డి 4, రహిమాన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 32.3 ఓవర్లలో 18 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని దినేష్ 51 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు మల్లేశన్ 4, అనిల్ 4 వికెట్లు తీశారు. దీంతో చిత్తూరు జట్టు 146 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

అనంత జట్టు విజయం : వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో అనంతపురం, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 48.1 ఓవర్లలో 301 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 124 పరుగులు చేశాడు. కడప బౌలర్లు చెన్నారెడ్డి 5, విజయభువేంద్ర 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టుకు 186 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో అనంతపురం జట్టు ఘనవిజయం సాధించింది.

ఉరుసుకు వెళ్తుండగా..

– స్కూటర్లు ఢీకొని వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : ఉరుసుకు వెళ్తుండగా శుక్రవారం రాత్రి 10.3 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలోని జోగ్‌పాలెంకు చెందిన ఖాదర్‌బాషా(55), కరీముల్లా స్నేహితులు. వారు జమ్మలమడుగు పట్టణంలో జరిగే గూడుమస్తాన్‌వలి దర్గా ఉరుసు ఉత్సవానికి స్కూటర్‌పై బయలుదేరారు. అదే సమయంలో జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వైపు నరేష్, రామచంద్రారెడ్డి స్కూటర్‌పై వస్తున్నారు. మార్గంమధ్యలోని దేవగుడి గ్రామం బైపాస్ వద్ద ఎదురెదురుగా వస్తున్న వీరి స్కూటర్లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఖాదర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందగా, కరీముల్లా, నరేష్, రామచంద్రారెడ్డికి గాయాలయ్యాయి. బాధితులను ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

కడప స్పోర్ట్స్ : క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఆధ్వర్యంలో మే నెల 1వ తేదీ నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సీఏవైడీ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. కడప నగరంలోని నెట్స్‌కేంద్రంతో పాటు నందలూరు, ప్రొద్దుటూరు, బి.మఠం సబ్ సెంటర్‌లలో శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8.30 వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆయా సబ్‌సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రిమ్స్‌లో అత్యాధునిక పరికరం ఏర్పాటు

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చెవి, ముక్కు, గొంతు (ఈ.ఎన్.టి) విభాగంలో వినికిడి పరీక్షలను చేయడానికి ఉపయోగించే ఆడియోమీటర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీబాయి, ఆర్ఎంఓ వై. శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 శ్రీకాంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కరన్ మాట్లాడుతూ ఈ పరికరంతో చెవుడు సమస్య వున్నవారిని పరీక్షించి అవసరమైతే ఆపరేషన్‌లు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కడప ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇద్దరు డైరెక్టర్ల నియామకం

కలసపాడు : జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్ర డైరెక్టర్ పదవులు లభించాయి. కలసపాడు మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన పోకల రామకృష్ణారెడ్డి టూరిజం శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఐటీ వింగ్ చల్లామధుసూదన్‌రెడ్డి, టూరిజం శాఖ రాష్ట్ర చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధకు కృతజ్ఞతలు తెలిపారు.


సజ్జల రామకృష్ణారెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న పోకల రామకృష్ణారెడ్డి

ఎమ్ఎస్ఎమ్ఈ డైరెక్టర్‌గా చల్లా వెంకటసుబ్బారెడ్డి



కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా చెన్నూరు మండలం ఓబుళంపల్లి గ్రామానికి చెందిన చల్లా వెంకటసుబ్బారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఓబుళంపల్లి ఉప సర్పంచ్‌గా సేవలు అందించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పని చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, కమలాపురం శాసనసభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..

వెల్లాలలో మే 1 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు మే 1 నుంచి 9వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా 2న కల్యాణోత్సవం, 4న హనుమంతోత్సవం, 5న గరుడోత్సవం, 7న రథోత్సవం (తిరుణాల) కార్యక్రమాలు ని ర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, ఈఓ బీవీ నరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. 5న శుక్రవారం రాత్రి ఆర్కెస్ట్రా ఉందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని భక్తులే కాక ఇతర రాష్ట్రాల నుంచి వస్తారని బలరామిరెడ్డి చెప్పారు.

7న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

7న రథోత్సవమును పురస్కరించుకొని రాష్ట్రస్థాయి సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండవ, మూడవ, నాల్గ వ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.1,10,000, రూ.75,000, రూ.50,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000, మిగిలిన ఎడ్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు.


వెల్లాలలోని శ్రీసంజీవరాయస్వామి

8న ఒంటెద్దు బండలాగుడు పోటీలు

8న ఉదయం ఒంటెద్దు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. అందులో గెలుపొందిన ఎద్దు యజమానికి మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.15,000, రూ.10,000, రూ.7000 రూ.4000, రూ.2500, రూ.2000లు అందిస్తామన్నారు.

కొత్త రిక్రూట్‌మెంట్ పైనే అందరి దృష్టి

- నేడు 89 మంది స్టాఫ్‌నర్స్‌ల నియామకం
- త్వరలో మరో 122 పోస్టుల భర్తీ
- అక్రమాలకు ఆస్కారం లేకుండా అధికారుల చర్యలు

కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో ఇటీవల జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకం పెద్ద దుమారమే రేపింది. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బోగస్ సర్టిఫికెట్లు పొందారు. అందులో కొంత మంది ఉద్యోగాలను సైతం సంపాదించారు. ఈ అక్రమాలపై లోతుగా దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలి. తాజాగా చేపట్టే నియామకాలకు సంబంధించి ఎవరికీ, ఎలాంటి అనుమానాలు లేకుండా మార్గం సుగమం చేయాలి. కాగా రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి ఆస్కారం లేకుండా వైద్య ఆరోగ్యశాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాల నియామకాలను చేపడుతోంది. అదే చిత్తశుద్ధితో అధికారులు పని చేసి అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని నిరుద్యోగులు, ఆ శాఖ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 రాయలసీమ జిల్లాల్లోని అర్హులైన అభ్యర్థులకు మరోమారు ఇదొక తీపి కబురుగానే చెప్పుకోవచ్చు. మళ్లీ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకాల ప్రక్రియ జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారులు కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లను సిద్ధం చేశారు.

మొత్తం 211 పోస్టులకు...

కడప పాత రిమ్స్‌లోని ఆ శాఖ ప్రాంగణంలో శనివారం రాయలసీమ జిల్లాల్లోని అభ్యర్థులకు స్టాఫ్ నర్స్ నియామక ప్రక్రియను చేపడుతారు. మొత్తం 89 మంది స్టాఫ్ నర్స్‌లకు ఉద్యోగ నియామకాలను నిర్వహిస్తారు. వారంతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను అందిస్తారు. అలాగే త్వరలో 122 స్టాఫ్ నర్సుల ఉద్యోగ నియామకాలను చేపడుతారు. అందులో కొత్తగా ఏర్పాటైన నంద్యాల మెడికల్ కాలేజీతో పాటు తిరుపతి రుయా మెటర్నిటీ విభాగానికి నియామకాలను చేపట్టనున్నారు. మొత్తం 211 మందికి అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలను చేపట్టడంతో వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగులుగా మారారు. తాజాగా మళ్లీ నియామకాలకు శ్రీకారం చుట్టడంతో అర్హులైన నిరుద్యోగుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

జనవరిలో జరిగిన అక్రమాలు వెలుగులోకి..

ప్రభుత్వం జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా 900 పైగా స్టాఫ్ నర్సు నియామకాలను చేపట్టింది. అందులో వైఎస్సార్ జిల్లా నుంచి 292 మంది ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో కొంత మంది స్టాఫ్ నర్సులు మెరిట్ కోసం బోగస్ మార్కులిస్టులు తెచ్చారనే సమాచారం వచ్చింది.



కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

ఇందుకు సంబంధించి అనుమానితుల మార్కులిస్టులను విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి పంపారు. ఆ పత్రాలను పరిశీలించిన అధికారులు బోగస్‌వని నిర్ధారించారు. ఇలా మొత్తం 16 మంది అభ్యర్థులు బోగస్ సర్టిఫికెట్లను సమర్పించి అందులో 15 మంది ఉద్యోగాలు పొందగా, మెరిట్ లేనందున ఒకరు మాత్రం పొందలేదు. అంతకుముందు ఒకరు ఏకంగా స్టాఫ్ నర్సు బోగస్ నియామక పత్రాన్నే సృష్టించుకుని పోస్టింగ్ కోసం చిత్తూరుకు వెళ్లింది. అక్కడి అధికారులు ఈమెకు ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడానికి ఖాళీ లేదని ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో ఆ నియామకపత్రం బోగస్‌దని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం నిర్ధారించింది. ఈమెపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మిగతా 16 మందిపై కేసులు బనాయించి విచారణ చేపట్టాల్సి ఉంది. కాగా బోగస్ సర్టిఫికెట్లు పొందిన వారంతా చిత్తూరు జిల్లా వాసులే కావడం, అక్కడ పని చేసిన ఉద్యోగులపైనే ఆరోపణలు రావడం గమనార్హం. ఈ అక్రమాలపై 'సాక్షి' పలు కథనాలను ప్రచురించడంతో ఆ శాఖతోపాటు బోగస్ అభ్యర్థులు, ఉద్యోగ వర్గాల్లో అలజడి మొదలైంది. బోగస్ సర్టిఫికెట్స్‌తో పొందిన వారంతా ఉద్యోగాలను వదిలి వెళ్లిపోయారు.

మొత్తం 11 వేల దరఖాస్తుల్లో...

జనవరిలో చేపట్టిన మొత్తం 292 స్టాఫ్ నర్సు నియామకాలకు రాయలసీమ జిల్లాల నుంచి మొత్తం 11 వేల మందికి పైగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో మెరిట్ ప్రాతిపదికన 292 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అంటే బోగస్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించాక.. ఆ స్థానంలో మరొకరికి అవకాశం కల్పించారు. తాజాగా కొత్తగా జరిగే రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి 11 వేల దరఖాస్తుల్లో 292 మంది ఉద్యోగాలు పొందగా మిగిలిన అభ్యర్థుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. మెరిట్ తదితర నిబంధనల ఆధారంగా తాజాగా జరిగే కౌన్సెలింగ్‌లో అర్హులైన వారిని స్టాఫ్ నర్స్‌లుగా నియమిస్తారు. ఈ నేపథ్యంలో ఉన్న దరఖాస్తుల్లో మరిన్ని బోగస్ సర్టిఫికెట్లు ఉన్నట్లుగా సమాచారం. దీంతో ప్రస్తుతం జరుగుతున్న నియామక కౌన్సెలింగ్‌కు సంబంధించి అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా బోగస్ సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులను సమగ్రంగా విచారణ చేస్తే తెరవెనుక ఉండి నడిపిస్తున్న సూత్రధారులు బయట పడుతారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం



కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలకు సంబంధించి అన్ని చర్యలు చేపట్టాం. అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తాం. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను నిర్ధారణ కోసం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీకి పంపిస్తాం. ఇది వరకు జరిగిన బోగస్ సర్టిఫికెట్స్ అక్రమాలపై విచారణకు ఆదేశించాం. ఎంతటి వారైనా సరే అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షిస్తాం. అలాగే సూపరింటెండెంట్ పదోన్నతుల విషయంలో 33 శాతం రిజర్వేషన్ల ప్రకారం మహిళా ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పిస్తాం.

– డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, కడప

తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్


క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాదరాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ
దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120
డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా
యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు
రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.
– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్‌ఎం, వాల్తేరు

ఆ సంఘాల ఆందోళనలకు దూరంగా ఉందాం

- గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు
- ఒకే విడతన 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులకు, ప్రభుత్వం మధ్య సుహృద్భావ వాతావరణం ఉంది
- కొన్ని సంఘాలు స్వార్థం కోసం దానిని చెడగొట్టడానికి చూస్తున్నాయి
- సచివాలయాల ఉద్యోగులందరూ గమనించాలి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

సాక్షి, అమరావతి : స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనలకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకే విడతలో లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపింది. అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని ఉద్యోగ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనవద్దని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, కొన్ని ఉద్యోగ సంఘాలు స్వార్థ, రాజకీయ అవసరాలకు ఆ వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులందరూ దీనిని గమనించాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసి, ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేసి అందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగులందరూ ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా 010 పద్దు కింద జీతాలు ఇచ్చారని, డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో నెగిటివ్ మార్కులు తొలగించారని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, శానిటేషన్ సెక్రటరీలకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయంటే సీఎం జగన్‌కు మనపై ఉన్న ప్రేమాభిమానాలే కారణమని చెప్పారు.

బదిలీలపై గందరగోళం సృష్టిస్తున్నారు

సచివాలయాల ఉద్యోగులు చాలా మంది వివిధ కారణాలతో బదిలీలు కోరుకుంటున్నారని తెలిసిన వెంటనే సీఎం జగన్ అంగీకారం తెలిపారన్నారు. సచివాలయాల మహిళా ఉద్యోగులు పెళ్లి చేసుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు రిక్వెస్టు బదిలీలు కాదని, సాధారణ బదిలీలు జరపాలని వితండ వాదం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ కావాలని కోరుకున్నా ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని వాళ్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయాల ఉద్యోగులందరినీ బదిలీ చేయమని చెప్పడానికి వీళ్లెవరని నిలదీశారు. బదిలీ వద్దనుకొనే ఉద్యోగిని కూడా బలవంతంగా బదిలీ చేయమనడానికి వీళ్లకేం హక్కుందన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకే సాధారణ బదిలీ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు మాత్రం మూడేళ్లకే సాధారణ బదిలీలు చేయమని ఉద్యోగ సంఘం నాయకులు ఎలా అడుగుతారని అన్నారు. గందరగోళం సృష్టించి బదిలీ ప్రక్రియను అడ్డుకోవడానికి కొందరు జేఏసీల పేరుతో ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని తప్పుపట్టారు. దీనిని అందరూ గమనించాలని కోరారు. సచివాలయాల ఉద్యోగులు ఆ ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు.

వేదాలు విజ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- ఇద్దరికి మహా మహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు
- 539 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్: వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి, సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన ఆర్. మణి ద్రావిడ శాస్త్రికి మహా మహోపాధ్యాయ పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన కె. రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన సి.వంశీకృష్ణ ఘనాపాఠికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. సర్టిఫికెట్ కోర్సుల నుంచి పీహెచ్‌డీ వరకు వేద విద్యనభ్యసించిన 539 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వేలాది సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గణిత, వైజ్ఞానిక, ఆర్థిక, సాంకేతిక, జ్యోతిష్య శాస్త్రాలను వేదాల్లోని వైదిక అంశాలతో మేళవించి ప్రపంచానికి తెలియజేశారన్నారు. భారతీయ సంప్రదాయం, ఆధునిక శాస్త్ర సాంకేతికత మధ్య సమన్వయం పెంపొందించుకోగలిగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యాం, ఈసీ సభ్యులు హరే కృష్ణ శతపతి, ఫణి యాజులు తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గాను దర్శించుకోవడం నా అదృష్టం

కడప కల్చరల్/రాజంపేట/ఒంటిమిట్ట: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకోవడం తన అదృష్టమని, ఇది దైవం కల్పించిన మహాభాగ్యంగా భావిస్తున్నానని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కడప పెద్ద దర్గాకు వచ్చారు. దర్గాలో గవర్నర్ పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గవర్నర్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు ఉన్నారు.

ఒంటిమిట్ట రాములోరిని దర్శించుకున్న గవర్నర్

ఒంటిమిట్టలోని కోదండరాముడిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని ఒంటిమిట్ట నుంచి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐఐటీలకు దీటుగా ఉద్యాన వర్సిటీ

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అకడమిక్ బ్లాక్, హాస్టళ్లను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు: ఐఐటీలు, ఎన్‌ఐటీలకు దీటుగా ఉద్యాన, వ్యవసాయ వర్సిటీలను తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో రూ.22.81 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, రెండు గర్ల్స్ హాస్టళ్లు, ఒక బాయ్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఉత్పత్తుల ఎగ్జిబిషన్ భవనాలను శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. వనిపెంటలోని కేవీకే అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ఉద్యాన వర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిధిలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతరాజుపేట కళాశాలలో రైతుల వసతిగృహం, అతిథిగృహం ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. వైఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరాం మాట్లాడారు. అనంతరం పుట్టగొడుగుల సాగుపుస్తకం, కరపత్రాలు, అంబాజీపేట పరిశోధనా స్థానం రూపొందించిన కొబ్బరి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు

- ఈ ఏడాది నుంచి రీస్ట్రక్చర్.. సిలబస్ రీడిజైన్
- ఈ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు
- ఫ్యాప్సీ అవార్డుల సన్నాహక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన


మాట్లాడుతున్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రీస్ట్రక్చర్‌తో పాటు సిలబస్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2023 సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆటోమొబైల్ రంగాల్లో వీరు తమ నైపుణ్యంతో రాణించేలా తయారు చేస్తామని చెప్పారు. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీఐల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 192 స్కిల్ హబ్‌ల్లో మెరికలు తిరిగే కోర్సులను డిజైన్ చేశామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కొత్త పారిశ్రామిక పాలసీలో కొన్ని మార్పులు చేయాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇండస్ట్రియల్ హోదా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కీలకపాత్ర ఉందన్నారు. ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి కరుణేంద్ర మాట్లాడుతూ ఫ్యాప్సీ ఎక్స్‌లెన్స్–2023 అవార్డుల కోసం జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11 కేటగిరీల్లో ఈ అవార్డులుంటాయని, ఈ అవార్డులు ఇవ్వడానికి 11 మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ అవార్డులను ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రదానం చేస్తామని చెప్పారు.అనంతరం అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుతరావు, ఎఫ్‌టీసీసీఐ సీఈవో ఖ్యాతి తదితరులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- తన జల్సాలను ప్రశ్నిస్తున్నాడని భర్తను హత్య చేసిన జమలమ్మ
- ఎన్టీఆర్ జిల్లాలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్ : తన జల్సాలకు అడ్డుపడుతున్న భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మీ శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 నవంబర్ 23న కొత్తపేట (టూ టౌన్) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన అప్పట్లో నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జమలమ్మకు జి.కొండూరు మండలం వెంకటాపురానికి చెందిన ఏడుకొండలు(32)కు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లకు జమలమ్మ చెడు వ్యసనాలకు బానిసైంది. వీటిపై ప్రశ్నిస్తున్న భర్త ఏడుకొండలును అడ్డు తొలగించుకోవాలనే నిర్ణయాన్ని తన చెల్లెలు లక్ష్మికి వివరించింది. అదే గ్రామంలో హత్య చేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కాపురాన్ని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.నైనవరం గ్రామానికి మార్చింది. అంబాపురంలో కొత్త ఇంట్లోకి ప్రవేశించిన రోజునే చెల్లెలు లక్ష్మి, న్యూఆర్‌ఆర్ పేటకు చెందిన ఒడియార్ గణేష్, జక్కంపూడికి చెందిన బాలసాని తిరుపతి సాయంతో జమలమ్మ తన భర్త ఏడుకొండలు మెడకు తాడు చుట్టి చంపేసిందని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి వస్తున్న దుర్వాసను పసిగట్టిన ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జమలమ్మకు కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు.

చైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన వాణి

పెనమలూరు : శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి(17) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతోంది. గత రెండు రోజుల కిందట ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది. కాగా గురువారం వాణి సోదరుడు రాము కాలేజీ హాస్టల్‌కు వచ్చి వాణితో మాట్లాడి వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో స్టడీ అవర్‌కు రావాల్సిన వాణి రాలేదు. దీంతో ఆమె కోసం రూమ్‌కు వెళ్లి మిత్రులు చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమంలో పాల్గొనం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమాల్లో పాల్గొనబోమని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై పోరాటం చేసే విధంగా కొన్ని శక్తులు సచివాలయ ఉద్యోగులను రెచ్చ గొడుతున్నాయని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు వారి మాటలకు ప్రభావితం కావొద్దని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు సిరిపురం హరి, కె.రామకృష్ణా రెడ్డి, జి.హరీంద్ర, కె.కిరణ్, బి.పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరు కుట్ర చేస్తున్నారని, ఇలా కుట్ర పన్నిన వారెవ్వరూ తమకు ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. తమను ఉద్యోగులుగా గుర్తించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న సచివాలయ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రను ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష , కార్యదర్శులుగా కె.వైధురిదేవి, ఎ.సుస్మిత


ఎన్నికైన సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షురాలిగా కె.వైధురి దేవి, ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మణ కుమారి, కార్యదర్శిగా ఎ.సుస్మిత, అదనపు కార్యదర్శి(జనరల్)గా ఎం.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి (కల్చరల్)గా ఎస్.నాగ లలితాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా టి.శారద ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.విజయలక్ష్మి, డి.సాహిత్య వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల వివరాలను ఎన్నికల అధికారి ఎస్.శాంతి కుమారి శుక్రవారం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల హక్కుల రక్షణకు చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఎస్టీ ఉద్యోగుల సర్వీసు సమస్యలపై గురు, శుక్రవారాల్లో విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ విచారణ నిర్వహించింది. ఈ విచారణకు అధ్యక్షత వహించిన రవిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఏడు శాఖలకు చెందిన అధికారులను పిలిచి విచారించినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా సూచనలు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రజల నివాస, వ్యవసాయ భూముల సమస్యలపై కూడా విచారణ చేసి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, డిప్యూటీ డైరెక్టర్ పొట్లూరి పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల విలువ పెంపుతో గిరి రైతు మనుగడ

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగన్నాథరావు
- కనుల పండువగా విత్తనాల పండగ

డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో పంటల ఉత్పత్తుల విలువ హెచ్చింపుతోనే గిరిజన రైతులకు మనుగడ ఉంటుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు అన్నారు. డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గ్రామంలో సంజీవని సంస్థ, ధింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా శుక్రవారం జీవ వైవిధ్య జాతరలో భాగంగా విత్తనాల పండగను ఘనంగా నిర్వహించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో పాటు ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పాత విత్తనాల ద్వారా గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న అన్ని పంటల్లోనూ పోషక విలువలు అధికంగా ఉన్నాయన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఉద్యోగ విప్లవం

- ఒకే వేదికపై 761 మందికి ఆఫర్ లెటర్స్
- తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ పత్రాలు


తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అమ్మానాన్నల పాదాలకు విద్యార్థులు నమస్కరించారు. తమ అభ్యున్నతికి అహరహం శ్రమించిన తల్లిదండ్రులను విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులే సత్కరించారు. ఈ అరుదైన సంఘటన గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయం (ఏయూ)లో కనిపించింది. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ కళాశాల అచీవర్స్ డే దీనికి వేదికైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగ విప్లవానికి వేదికగా నిలిచింది. ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏయూ రాష్ట్రానికి ఆదర్శంగా, విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలుస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రత్నాల్లాంటి పిల్లలను పెంచి విశ్వవిద్యాలయానికి పంపిన తల్లిదండ్రులందరినీ సన్మానించడం చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన, ఉపాధి కల్పన చేసే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఇచ్చే నిజమైన సంపద విద్య అని ముఖ్యమంత్రి ఇదే వేదిక నుంచి అన్నారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో మీ పిల్లలను పెంచినందుకు మీ అందరికీ వందనం అంటూ తల్లిదండ్రులకు నమస్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది 81 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఈ సంవత్సరం దీన్ని అధిగమించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.2 లక్షల నష్టం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫీజుల పేరుతో పెదనాన్న, బాబాయిల దగ్గర్నుంచి నగదు వసూలు
- ఆన్‌లైన్‌లో లుడో ఆడి డబ్బులు పోగొట్టుకున్న వైనం
- ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు

బాపట్లటౌన్ : ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి బీటెక్ విద్యార్థి రూ.2 లక్షలు నష్టపోయి చివరకు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కర్లపాలెం మండలం చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి వెంకటనారాయణ విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆన్‌లైన్‌లో లుడో గేమ్ తన స్నేహితులతో కలిసి ఆడాడు. ఈ గేమ్‌లో తొలుత రూ.100 పెట్టుబడికి రూ.1000 వరకు వచ్చాయి. ఇదే మోజులో సాయంత్రం వరకూ ఆడుతూనే ఉన్నాడు. ఇంతలో పాకెట్‌మనీ నిమిత్తం చేతిలో ఉంచుకున్న రూ.30 వేలు పోయాయి. తర్వాత తన స్నేహితుడి వద్ద రూ.70 వేలు, తన పెదనాన్న, బాబాయిలకు ఫోన్ చేసి కళాశాలలో ఫీజు చెల్లించాలంటూ నమ్మబలికి మరో రూ.లక్ష వరకూ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో విడతల వారీగా రూ.2 లక్షలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి రైలు మార్గాన బాపట్ల చేరుకున్నాడు. అప్పటికే ఎలుకల పేస్ట్ తిన్నాడు. రైల్వేస్టేషన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్ సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.